ఆశీలపాట వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం

విశాలాంధ్ర కథనానికి స్పందించిన సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మార్చి 19వ తేదీన జరిగిన ఆశీల పాట వ్యవహారం పై బుధవారం విశాలాంధ్ర దిన పత్రికలో ప్రచురితమైన "పైసలిస్తే పాటఖరార్"అనే కథనంపై సిపిఐ,సిపిఎం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పందించి మాట్లాడారు.

పాలకవర్గాన్ని విస్మరించినట్లే

వాస్తవానికి మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి జరగాలన్న, ఆదేశాలు జారీ చేయాలన్నా పాలకవర్గ అనుమతి తప్పనిసరి. ఇదంతా మున్సిపల్ చట్టంలో పొందు పరిచి ఉన్నప్పటికీ పాలకవర్గ అనుమతి గాని, చైర్ పర్సన్ ముందస్తు అనుమతిగాని తీసుకోకుండా ఆశీల వసూళ్లకు మున్సిపల్ అధికారి మౌఖిక ఆదేశాలు జారీ చేయడం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కినట్లే. ఇది ముమ్మాటికి పాలకవర్గాన్ని కించపరిచినట్లే. అధికారులు ప్రతీపనికి చేతివాటం చూపిస్తూ ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టడం అలవాటుగా మారిపోయింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తాం.

- టి.జీవన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి

పాలకవర్గం కళ్ళు తెరవాలి



మున్సిపాలిటీలో జరుగుతున్న అవకతవకలపై పలు దినపత్రికల్లో వస్తున్న కథనాలపై పాలకవర్గం కళ్ళు తెరిచి అధికారుల ఆగడాలకు కళ్లెం వేయాలి. ఆశీల వేలంపాటలో అధికారులు నిబంధనలు పాటించలేదన్న కదనంపై స్పందించి పాలకవర్గ సభ్యులు స్పష్టత ఇవ్వాలి. పాలకవర్గ అనుమతులు లేకుండా మౌఖిక ఆదేశాలు మున్సిపల్ అధికారులు జారీ చేశారంటే పాలకవర్గం పట్ల, మున్సిపల్ నిబంధనల పట్ల మున్సిపల్ అధికారులకు ఏమేర గౌరవం ఉందో అర్థమవుతుంది. మున్సిపాలిటీలో జరుగుతున్న అవకతవకలపై త్వరలోనే మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపడుతాం.

- వంగల దాలినాయుడు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్

విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం

మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన బహిరంగ ఆశీల వేలంపాట వ్యవహారంలో అధికారుల తీరును ఎండ గడుతూ ఈ విషయంపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తాం. మాజీ కౌన్సిలర్‌గా నాకు ఉన్న అనుభవం ప్రకారం ఆశీలవేలంపాట జరిగిన అనంతరం పాలకవర్గ అనుమతి పొందిన తర్వాతే సంబంధిత కాంట్రాక్టర్‌కు అధికారులు ఆసీలు వసూలు చేసుకోవచ్చని ఆదేశాలు జారీ చేయాలి. ఆ ఆదేశాలు జారీ అయినంత వరకు మున్సిపల్ సిబ్బందితో ఆశీలు వసూళ్లు చేపట్టాలే తప్ప పాలకవర్గ అనుమతిగాని, మున్సిపల్ చైర్ పర్సన్ ముందస్తు అనుమతి గానీ లేకుండా మౌఖికంగా మున్సిపల్ అధికారి ఆదేశాలు జారీ చేయడం ఇంతవరకు పార్వతీపురం మున్సిపల్ చరిత్రలో జరగలేదు. సాక్షాత్తు మున్సిపల్ చైర్ పర్సన్ నేను ఎటువంటి ముందస్తు అనుమతులు ఇవ్వలేదని చెప్పినప్పటికీ ఈ విషయాన్ని అధికారులు ఇంకా గోప్యంగా ఉంచడం అధికారుల అహంకారానికి నిదర్శనం. ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఫిర్యాదు చేస్తాం.

- పాకల సన్యాసిరావు,
పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధించిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని, పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భాల్లో కంటితుడుపు చర్యగా ధరలు తగ్గిస్తూ, ఎన్నికల ప్రక్రియ ముగియగానే ప్రజలపై ధరల గుదిబండ వేసిందన్నారు. ఎక్సైజ్ సుంకం పేరుతో రూ.2/-లు చొప్పున పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దుర్మార్గం అన్నారు. అలాగే వంట గ్యాస్ ధరను రూ.50/-లు పెంచి ప్రజలపై పెనుభారం వేయడాన్ని ఖండించారు.

బిసి లబ్ధిదారుల ఖాతాలు తక్షణం తెరవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్ల మేరకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు తక్షణం తెరవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బిసి యూనిట్ల ఏర్పాటుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి బిసి స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో కనీసం 8 కోట్ల రూపాయల విలువ మేరకు యూనిట్లు ప్రారంభం కావాలని ఆయన ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలో గల బ్యాంకులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారుల ఖాతాలను తక్షణం ప్రారంభించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు యూనిట్ల వివరాలు తెలిపారు. పాచిపెంట మండలానికి 52, గరుగుబిల్లి 87, కొమరాడ 50, సీతానగరం 35, సాలూరు 42, గుమ్మలక్ష్మీపురం 14, కురుపాం 5, భామిని 23, జియ్యమ్మవలస 3 ఉన్నాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజయ స్వరూప్ పాల్గొన్నారు.

సహజ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మాతృమూర్తులు సహజ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, నెల గడిచిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం భద్రత, రక్తహీనత మొదలైన అంశాలపై జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ప్రసన్న గర్భిణీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం సుమారు 45 మంది గర్భిణీలకు చికిత్స అందించారు. వారిలో 10 మంది వరకు రక్త హీనత ఉందని వారందరూ అవసరమైన చికిత్స అందిస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం వారందరికి సాయి మాతా ప్రేమామృతాహారాన్ని సత్యసాయి ట్రస్టు జియ్యమ్మవలస వారు అందించారు.

అఖిలభారత కిసాన్ జాతీయ మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పాలకొండ: అఖిల భారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15,16,17 తేదీలలో తమిళనాడు రాష్ట్రం నాగ పట్నంలో మహాసభలు జరుగనున్నాయని అన్నారు. ఈ మహాసభల్లో దేశవ్యాప్త వ్యవసాయ విధానంలో వస్తున్న మార్పులను, సంక్లిష్ట పరిస్థితులకు ప్రత్యా మ్నాయ విధానం ద్వారా వ్యవసాయాన్ని రక్షించుకోవడానికి రైతును కాపాడుకోవడానికి పాలక పక్షాలపై ఒత్తిడి తీసుకురావడానికి ఉద్యమ కార్యాచరణ చేయనున్నట్టు తెలిపారు. రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతు రుణాలను ఒక పర్యాయం దేశవ్యాప్తంగా మాఫీ చేయాలని సభలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామమూర్తి నాయుడు, జిల్లా కోశాధికారి బొత్స గౌరు నాయుడు, జల సంఘం సంఘం డైరెక్టర్ బచ్చల పారినాయుడు ఉన్నారు.

బీజేపీ పతాకావిష్కరణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని బగ్గందొరవలస గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వార్షిక దినోత్సవ వేడుకలను సీతానగరం మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు గొలగాన బాలకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, పార్వతీపురం నియోజకవర్గ కన్వీనర్ సొండి సంజీవి మాస్టారులు హాజరై పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు బిజెపిలో చేరినట్లు బాలకృష్ణ తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి: సీపీఎం

విశాలాంధ్ర - బలిజీపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఎంపీడీఓ నగేష్‌కు వినతి అందజేశారు. సీపీఎం మండల నాయకులు బొద్దాన భానుమూర్తి, సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం విధానాలు తూట్లు పొడిచే విధంగా ఉన్నాయని, ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉపాధి కూలీలకు నరకం చూపిస్తున్నారన్నారు. రెండుపూటలా పనుల వల్ల వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నారన్నారు. ఉపాధి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు పిసా వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు, యమ్మల మన్మధరావు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో

విశాలాంధ్ర - వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి సచివాలయాన్ని ఎంపీడీవో బి.వెంకటరమణ తనిఖీ చేశారు, వర్క్ ఫ్రం హెూం సర్వే, చిల్డ్రన్ విదౌట్ ఆధార్, హౌస్ హెూల్డ్ జియో టాగింగ్ సర్వేలు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగభూషణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం మండల పరిధిలో నిర్మాణంలో వున్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల పనులను శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు విభాగం ఎస్పీ బర్ల ప్రసాదరావు పరిశీలించారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ చేపట్టిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులను పరిశీలించారు. ఆమోదం పొందిన ప్లాన్ల ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నది లేనిది పరిశీలించారు. నాణ్యత పరీక్షలు చేసిన తరువాత పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. తాగు నీరు సమస్య, రాత్రి సమయాలలో లైటింగ్ లేకపోవడం, కాంపౌండ్ వాల్, కిటికీలకు గ్రిల్ లేకపోవడం వంటి సమస్యలు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. తనిఖీలలో విజిలెన్స్ డిఇ సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ మణిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా సుధారాణి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధారాణిని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ నియమించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, గ్రామస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందులో భాగంగానే ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఐకెపి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.సుధారాణి మండల అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. అలాగే నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారిగా ఐటిడిఎ పిఓకు బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో మండల అభివృద్ధి పరుగులు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం నుండి పార్వతీపురం వెళ్లే ప్రధాన రహదారిలో కొనగూడ సెంటర్ సమీపంలో గల ఎస్ఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. వ్యాపారం అంచెలంచలుగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు వైరిచర్ల ప్రదీప్ కుమార్ దేవ్, ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వర రావు, ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీశంకర్, మండ సర్పంచ్ హైమావతి, పెట్రోల్ బంక్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చింతపల్లి: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల మినహా మిగిలిన సామాజిక వర్గాల వారికి ఉచితంగా అందించే కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నకేశవ నాయుడులతో కలిసి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మూడు మాసాలపాటు నిర్వహించే కుట్టుమిషన్ ఉచిత శిక్షణకు సంబంధించి భవనం ఏర్పాటుకై వారు ఎంపీడీవోను కలసి చర్చించారు. ప్రతిరోజు విడతల వారీగా అందించే ఈ శిక్షణను 20 ఏళ్ల నుండి 40 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

21న ఐటీడీఏ పాలకవర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పాలకవర్గ సమావేశాన్ని ఈనెల 21వ తేదీన ఉదయం 11.00 గంటలకు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో, జాయింట్ కలెక్టర్ డా.ఎంజె అభిషేక్ గౌడ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పార్లమెంట్ సభ్యులకు, జిల్లా పరిషత్ అధ్యక్షులకు, ఎమ్మెల్సీలకు, శాసనసభ్యులకు మండల పరిషత్ అధ్యక్షులకు, జెడ్పీటీసీలకు సమాచారం పంపించామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు హాజరుకావాలని కోరారు.

దారకొండ, దుప్పలవాడ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కూటమి నాయకులు పాడేరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి దృష్టికి తీసుకువెళ్లారు. నారమామిడి గొంది, నిమ్మ చెట్టు, వర్తండపాడు, గంగవరం బ్రిడ్జి, అగ్రహారం బ్రిడ్జి ప్రాంతాల్లోని రెండు పంచాయతీలకు చెందిన గ్రామాల్లో సిమెంట్ కాంక్రీట్ (సిసి) రోడ్ల నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. అలాగే, ఆయా గ్రామాల్లో ఉన్న ఇతర సమస్యలను కూడా కూటమి నాయకులు గిడ్డి ఈశ్వరికి వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన గిడ్డి ఈశ్వరి, నాయకులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోతురాజు గోవిందరాజు, సుందర్రావు, శోభ జగన్, పీసా ఉపాధ్యక్షులు శెట్టి రాంబాబు తదితర కూటమి నాయకులు పాల్గన్నారు. వారు తమ ప్రాంతాల సమస్యలను గిడ్డి ఈశ్వరికి వివరించారు. గిడ్డి ఈశ్వరి సానుకూలంగా స్పందించడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీసీసీ గొడౌన్ తనిఖీ

విశాలాంధ్ర - జీకే వీధి: జీసీసీ గొడౌన్‌ను తహశీల్దార్ టి.రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ నెలా నిత్యావసర సరుకులను సకాలంలో డీఆర్ డిపోలకు చేరవేయాలని లేనిచో తగు చర్యలు తీసుకుంటామని గొడౌన్ ఇన్‌చార్జి వీరభద్రంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది జిసిసి గొడౌన్ ఇన్చార్జి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

మొండిగడ్డలో ఘటాల ఊరేగింపు

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని మొండిగడ్డ పంచాయతీ మొండిగడ్డ గ్రామంలో గ్రామ దేవత పండగ సందర్భంగా గ్రామస్తులు ఘటాలను ఊరేగిస్తూ కోలాటాలు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అంగరంగ వైభవంగా ఘటాలను ఊరేగిస్తూ కార్యక్రమాన్ని జరిపారు. ఉత్సాహంగా యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అడప ప్రియాంక, ఉత్సవ కమిటీ గబులంగి సత్యనారా యణ, గిరి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యాక్రాంతం

సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లా మన్యంలో ప్రభుత్వ ప్రైవేటు భూములు అన్యాక్రాంతమవుతున్నాయని దీనికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ వారి తీర్పుకి వ్యతిరేకంగా షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ న్యూఢిల్లీ వారికి బుధవారం ఢిల్లీలో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతల నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్లు ఎటువంటి విచారణ జరుపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి గిరిజనేతరులకు అనుకూలంగా ఉంటూ వందలాది ఎకరాలు కబ్జాలు అవుతున్నా అధికారులకు చలనం లేకుండా పోయిం దన్నారు. గిరిజన ప్రజలు ఫిర్యాదులు చేస్తే ప్రభుత్వ భూములు ఎల్ టి ఆర్ 1/70 భూ బదలాయింపు చట్టాలు వర్తించవని తీర్పులిస్తూ గిరిజనేతరులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడుతున్నారని అన్నారు. ఇలాంటి తీర్పులను అనుసరిస్తూ కొంతమంది గిరిజనులు బినామీ అవతారాలు ఎత్తి గిరిజన ప్రాంతంలో ఉన్న హక్కులు చట్టాలను తుంగలో తొక్కుతున్నారని అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్ ట్రైబల్ కమిషన్ మెంబర్ జటోత్ హుస్సేన్‌కి ఢిల్లీలో ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు.

11న మోదకొండమ్మ జాతర పందిరి రాట

విశాలాంధ్ర - హుకుంపేట: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేదీన హుకుంపేట శతకంపట్టు వద్ద పందిరి రాట వేయనున్నట్లు స్థానిక సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ తెలిపారు. 11వ తేదీ శుక్రవారం ఉదయం 10:30 గంటలకు రాట వేయనున్నట్లు చెప్పారు. ఎంపీటీసీ, వార్డు మెంబర్స్, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగస్తులు, వర్తక సంఘ పెద్దలు, యూత్ సభ్యులు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

విశాలాంధ్ర - అనంతగిరి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ శెట్టి నీలవేణి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏవివి కుమార్ పిఓపిఆర్డి ధర్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీల్లో పంచాయతీలు కార్యదర్శిల సమస్య పరిష్కారం అయిందని సరిపడా పంచాయతీ కార్యదర్శులు విధుల్లోకి రావడం తో వారికి పలు విధివిధానాలపై ఎంపీపీ శెట్టి నీలవేణి సూచనలను చేశారు.ఈ మేరకు గ్రామాల్లో తాగునీటి సమస్యపై క్షేత్రస్థాయిలో తెలుసుకొని పంచాయతీ పరిధిలో చేయాల్సిన పనులను వెంటనే చేయాలని బోర్లు మరమ్మ తులకు సంబంధించిన వివరాలను పంపితే మండల పరిషత్ ద్వారా బోర్లు మనమ్మతులు చేయిస్తామని ఆమె తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు విద్యా సంవత్సరం మొదలవుతున్న నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం ఉండకుండా చూడాలన్నారు.

172 కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - కొయ్యూరు: ఒడిశా నుండి కాకరపాడు మీదుగా నర్సీపట్నంకు రెండు ఆటోలతో అక్రమంగా తరలిస్తున్న 172 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ బుధవారం తెలిపారు. కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటరమణకు, ఎస్సై కిషోర్ వర్మకు గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని ముందస్తుగా అందిన సమాచారం మేరకు చీడి పాలెం జంక్షన్లో తమ సిబ్బందితో దాడి చేసి రెండు ఆటోలతో తరలిస్తున్న 172 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టుబడిన గంజాయి విలువ 8,6000 రూపాయలు ఉంటుందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న వై.రామవరం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన శెట్టి సంధ్యారావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నారని తెలిపారు. అలాగే ఆటోలను స్వాధీనపరచుకొని నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ కిషోర్ వర్మ తెలిపారు.

సిబ్బంది సహకారంతోనే అభివృద్ధి

విశాలాంధ్ర - అనంతగిరి: సిబ్బంది సహాయ సహకారాలతోనే మండల అభివృద్ధికి దోహదపడుతుందని ఆ దిశగా సచివాలయ సిబ్బంది కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ఎంపీడీవో ఎవివి.కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు గుర్తించే పరిష్కరించడంతోపాటు సచివాలయం సిబ్బంది విధుల నిర్వహణపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉందని కార్యదర్శులకు సూచించారు. చిన్నపిల్లలు ఆధార్ అనుసంధానం, మార్పులు చేర్పులు వంటి వాటిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు.

ఏనుగుబైలులో అన్నసమారాధన

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం ఏనుగుబైలు గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు భారీగా ప్రజలు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మృతి చెందిన వలస కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ కొండ శిఖర గ్రామమైన బూరిగా గ్రామంలో సోమల ఆదమ్మ వలస నిమిత్తం బాపట్ల జిల్లా అద్దంకి మండలం పరిధిలో పని చేసేదని అక్కడ అనారోగ్యంతో మృతి చెం దిందని సోముల అప్పలరాజు, కోనపర్తి సింహా చలం తెలిపారు. బాపట్ల జిల్లాలో కలవకూరు గ్రామానికి చెందిన వెంకటరమణ అనే ఇటుక బట్టి యజమాని వద్దకు విజయనగరం జిల్లా మెం టాడ మండలం గొర్ల గ్రామానికి చెందిన పుర నాన పాపారావు 60 మంది గిరిజన కూలీలను తీసుకువెళ్లారని సోమల ఆదమ్మ అనారోగ్యంతో అక్కడ మృతి చెందిందన్నారు. ఆదమ్మకు నలుగురు పిల్లలు ఉన్నారని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. వలస కూలీలకి అనారోగ్యం వస్తే సక్రమంగా వైద్యం చూపించక పోవడంతో పలువురు మృత్యువాత పడుతున్నారని వలసలను నివారించాలని డిమాండ్ చేశారు.

స్థాపితం:1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
రంపచోడవరం, వై.రామవరం, గంగవరం, అడ్డతీగల.
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్యరెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - చింతపల్లి: మన్య ప్రజల ఆరాధ్య దైవం, చింతపల్లి గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ మహోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను(వాల్ పోస్టర్స్) స్థానిక ఎంపీపీ కోరాబు అనుషాదేవి, జడ్ పి టీ సీ పోతురాజు బాలయ్యలు ఉత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దురియా హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావులతో కలిసి ఆవిష్కరించారు. స్థానిక ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం సమావేశమైన కమిటీ సభ్యుల సమక్షంలో గ్రామ దేవతగా పూజించే, శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 24 నుంచి 27 వరకు 4 రోజులు పాటు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముత్యాలమ్మ అమ్మవారి గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఉత్సవ కమిటీ సభ్యులుతో పాటు వివిధ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణీల్లో రక్తహీనత నివారణపై దృష్టిసారించాలి

విశాలాంధ్ర - బెలగాం : సురక్షిత ప్రసవమే ధ్యేయంగా గర్భిణీలకు వైద్య సేవలు అందజేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. పార్వతీపురం మండలం బందలుప్పి, డొకిశీల, పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీలకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, వాటి నివేదికలు రికార్డులు,ఎంసిపి కార్డుల్లో పరిశీలించారు. హీమోగ్లోబిన్ శాతం కొంత మంది గర్భిణీల్లో వృద్ధి చెందకపోవడాన్ని గమనించి అందుకు గల కారణాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు.ఐరన్, కాల్షియం మాత్రలు, పౌష్టికాహారం సరిగా తీసుకుంటున్నారా లేదా గృహ సందర్శనలు చేసి గమనించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలతో మాట్లాడి వారి ఆరోగ్యస్థితి, అందుతున్న వైద్య, అంగన్వాడీ సేవలపై అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పిహెచ్సీలో త్రాగు నీటి లభ్యతను పరిశీలించారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందితో సమీక్షించి రక్తహీనత, హై రిస్క్ గర్భిణీల ఆరోగ్యం మెరుగుకు కార్యాచరణ చేయాల న్నారు. ప్రతీ నెలా పిహెచ్సీలో ఎన్ని సాధారణ కాన్పులు చేపడుతున్నారు రికార్డులో పరిశీలించారు. అన్ని సాధారణ ప్రసవాలు పిహెచ్సీలో జరిగేలా కృషి చేయాలన్నారు. స్టాఫ్ నర్సులకు బ్యాచ్ ల వారీగా జిల్లా కేంద్రంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్.బి.ఎ శిక్షణలు పిహెచ్సీ ప్రసవాల మెరుగుకు దోహదపడాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ ల్యాబ్, లేబర్ రూమ్, వార్డు పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, ప్రాంగణాన్ని ఎప్పటికపుడు పరిశుభ్ర%శీ%గా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, డా. ఐశ్వర్య, డా. ధరణి, సూపర్వైజర్లు శ్రీరాములునాయుడు, సత్తిబాబు, శ్రీను, జయలక్ష్మీ, ఎస్. జయ, శంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సామాగ్రిని వితరణ చేసిన యూబీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం : కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద లక్ష రూపాయలు విలువైన కలర్ మరియు బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్లు, స్కానర్లను విరాళంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా (యూబీఐ) అందించినట్లు ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. బుధవారం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం అధికారుల నుంచి ఆయన కంప్యూటర్ సామాగ్రిని, ప్రింటర్లను స్వీకరించారు. వీటిని పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని వసతి గృహాలకు వినియోగిస్తామని పిఓ తెలిపారు. సిఎస్ఆర్ కింద సామాగ్రిని యూబీఐ శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం అధికారులు, బెలగాం యూనియన్ బ్యాంక్ మేనేజర్ అందజేయడం పట్ల ప్రాజెక్ట్ అధికారి హర్షం వ్యక్తం చేశారు.

14న డా. బి.ఆర్ అంబేద్కర్ జయంతి

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీ సోమవారం రోజున డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవాంం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.00 గం.లకు స్థానిక బెలగాం రైతు బజార్ కూడలి వద్ద డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలను వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్.సి నాయకులు, జిల్లా అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఏఎంసీ వైస్ చైర్మన్

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో నూతనంగా నియమించబడిన కురుపాం ఏఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్‌రావు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసారు. కొత్తగా నియమించబడిన కురుపాం ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీ శంకర్‌కు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు శ్రీకర్, నాయకులు అనంత్, ఉపేంద్ర, మణికంఠ ఉన్నారు.

జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం : విజయనగరం జిల్లాలో జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్‌తో కలసి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు. జిల్లాలో చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లాకు అనుకూల పరిస్థితులు, ఉన్న సమస్యల గురించి మంత్రి దృష్టికి కలెక్టర్ తీసుకువెళ్లారు.

రామమందిరం నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - పాలకొండ/వీరఘట్టం: పాలకొండ మండలం భాసూరు గ్రామంలో రామ మందిరం నిర్మాణానికి పాలకొండ పట్టణ టిడిపి అగ్ర నాయకుడు వల్లా కొండబాబు బుధవారం ఆ గ్రామస్తులకు పదివేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీద ఈ ధనసహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతంలో1/70 చట్టము అమల్లో ఉన్న నేపథ్యంలో అక్రమ కట్టడాలపై ప్రభుత్వం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల తహశీల్దార్ ఎస్.శేఖరం తెలిపారు. ఎల్విన్ పేట గ్రామపంచాయతీలోని గుణుపూర్ సెంటర్ దగ్గర సర్వే నంబర్ 60, గ్రామ కంఠంలోని 58, 61 నంబర్లు గల ప్రభుత్వ భూములపై ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే పీసా చట్టం,1/70 చట్టము ప్రకారము శిక్షలు తప్పవని ఆయన తెలియజేశారు. సదరు సర్వే నంబర్ల ప్రకారము ఎల్విన్ పేట గ్రామ నివాసి నేతేటి ఈశ్వరరావు(చంటి) తండ్రి లేటు సూర్యనారాయణరావు అనే అసామి అక్రమ నిర్మాణాలు చేపట్టడం వలన గిరిజన సంఘాలు, గిరిజనులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆక్రమణకు గురైన భూములను పరిరక్షించవలసిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ విఆర్వో సుమతి, పంచాయితీ రాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: విద్యుత్ రంగం ప్రైవేటీకరణ, శాశ్వత ఉద్యోగ, కాంట్రాక్ట్ కార్మికుల ఉత్తరాంధ్ర సదస్సుని జయప్రదం చేయాలని అల్లూరి జిల్లా విద్యుత్ ఉద్యోగులు, ఒప్పంద పొరుగు సేవల కార్మికుల జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఈ నెల 12న (శనివారం) ఉత్తరాంధ్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని కార్మికులతో కలిసి చింతపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ కార్మికులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికై. విద్యుత్తు రంగంలో వివిధ విభాగాలలో తీసుకు వస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈపీడీసీఎల్ పరిధిలో విశాఖపట్నంలో ఈ సదస్సు జరుగుతుందని అన్నారు. ఈ సదస్సులో ట్రాన్స్‌కో, జెన్కో డిస్కములలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల తో పాటు కాంట్రాక్ట్ కార్మికులందరూ హాజరు కావాలన్నారు. రోజురోజుకు ధరలు విపరీతంగా పెరుగుతున్నా, వేతనాలు మాత్రం పెరగడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా పిఆర్‌సి ఇవ్వాలని, కనీసం డిఏ అయినా యాడ్ చేయాలని, కనీసం ఇది కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినా ఒకే పని చేసే కార్మికులకు నాలుగు రకాల తేడాలతో వేతనాలు తగ్గించి ఇస్తున్నారని, నిరుద్యోగ భూతాన్ని చూపించి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా కాంట్రాక్ట్ కార్మికుల్ని పని గంటలలో, వేతనాలలో రెండింటిలో దోపిడీ చేస్తున్నదన్నారు. ఈ సదస్సు ఈనెల 12వ తేదీన విశాఖపట్నం దాబా గార్డెన్ లో ఉన్న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ కార్మికులు రాజబాబు. ప్రసాద్. సత్యనారాయణ. శేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

విశాలాంధ్ర - బలిజిపేట: మండలంలో వ్యవసాయ శాఖ - రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యచరణ ప్రణాళిక 2025-2026ను వ్యవసాయ అనుబంధ శాఖలు, వెలుగు శాఖ, అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యవసాయ వెలుగు శాఖ మధ్య సమన్వయం పాటిస్తూ ప్రకృతి వ్యవసాయ అలవాటు చేస్తూ రైతులకు నికర ఆదాయం పెరిగేలా చేయాలన్నారు. 30 రకాల విత్తనాలు సుమారు 12 కేజీలు తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలంలో జల్లుకొని 45 రోజుల తర్వాత భూములు దున్నుకోవడం వలన భూముల అధిక స్థాయిలో సూక్ష్మజీవులు పెరిగి నేల ఆరోగ్యంగ బాగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మరడాన కోటేశ్వరరావు, కర్రీ కేశవరావు, ప్రకృతి వ్యవసాయ శాఖ మండల ఇన్చార్జ్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన రహదారిపై గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు 9సార్లు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచి ప్రజలపై భారాల మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు సగానికి సగం తగ్గిపోయినప్పటికీ మన దేశంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెంచడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు.రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లు ప్రజలకు ఉచితంగా ఇస్తామనీ ఒక ప్రక్క చెబుతూనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రశ్నించక పోవడం విచారకరమని అన్నారు. పెట్రోలియం ఉత్పత్తులైన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం అంటే ప్రజలు కొనే అన్ని నిత్యవసర సరుకులు ధరలు పరోక్షంగా పెంచడమేనని అన్నారు. ధరలు ఒక వైపు పెంచుతూనే ఆ భారం ప్రజలపై పడదనీ అబద్ధాలు చెప్పడం మరి ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. తక్షణమే పెంచిన పెట్రోలియం ఉత్పత్తులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేసారు, లేనియెడల ప్రజాగ్రహానికి ఈ ప్రభుత్వం గురి కాక తప్పదని, ప్రజల తరపున సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ, సిపిఎం నాయకులు బంకురు సూరిబాబు, పాకల సన్యాసిరావు, సంచాన ఉమా మహేశ్వరరావు, బి.లక్ష్మి, ఎం.గౌరమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

బెలగాం : పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం ఆధ్వర్యంలో బుధవారం పార్వతీపురం మునిసిపల్ నవిరి కాలనీ ఎస్సీ కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం మాట్లాడుతూ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 2014లో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే అక్క చెల్లెమ్మలకు జీరో అకౌంట్ లో డబ్బులు వేస్తామని చెప్పడం జరిగిందని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అనేకసార్లు గ్యాస్, పెట్రోలు, డీజిల్ వంటివి ధరలు పెంచారని ఎన్నికలు ఉన్నాయని రూ.200 గ్యాస్ ధర తగ్గించారని మరలా అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు పెంచడం జరిగిందని అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెంచడం జరిగిందని ఇంకా పెంచే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీలు ఇచ్చారు కానీ ఇంతవరకు అమలు చేయలేదని, అమ్మకు వందనం పథకం కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని, రైతు భరోసా కూడా ఇంతవరకు అమలు చేయలేదని, అలాగే నిత్యవసర వస్తువులు ధరలు, విపరీతంగా వంట నూనె ధరలు పెంచారని ఇదేనా మీరు ఇచ్చిన హామీలు? ఇప్పటికైనా పెంచిన గ్యాస్ దారులను తగ్గించాలని అలాగే వినియోగదారులకు సబ్సిడీలు ఇవ్వాలని సంగం డిమాండ్ చేశారు. ధరలు తగ్గించని ఎడల ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసిటియు నాయకులు అజ్జారపు దామోదర్ రావు, రెడ్డి భాస్కరరావు మరియు కుమారి, రాములమ్మ, లక్ష్మి, దమయంతి, ఈశ్వరరావు ,సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి, కూటమి పాలకులు పురపాలనపై దృష్టిసారించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో గత కొద్ది రోజులుగా వైసిపి, కూటమి పాలకులు ఆడుతున్న కుర్చీ ఆట ఆపి పురపాలని పై దృష్టి సారించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. నియోజకవర్గ ఇన్చార్జి బత్తిన మోహనరావు ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, జిల్లా నాయకులు కోల కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపల్ చైర్ పర్సన్ కుర్చీ కోసం వైసిపి, కూటమి నాయకులు గత కొద్ది రోజులుగా కుర్చీ ఆట ఆడుతున్నారన్నారు. కుర్చీ ఆటలో పడి మున్సిపల్ పరిపాలనపై దృష్టి సారించడం లేదన్నారు.ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అవకతకులపై దిన పత్రికలు కోడై కూస్తున్నాయన్నారు.ఇప్పుడైతే పాలకులు ఏమరపాటుగా ఉండి పాలనపై దృష్టి సారించలేదో అదే అదునుగా అధికారులు తమ ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.దీనిలో భాగంగానే ఆశీలు పాటలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, నిబంధనలు పాటిం చలేదని దినపత్రికలో వచ్చిన వార్తపై వైసీపీ, కూటమి పాలకులు స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు.వీరి కుర్చీ కుమ్ములాటలో అధికారులు తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగానే మండు వేసవిలో తాగునీటి సరఫరా లేకపోవడం, పారిశుధ్య మెరుగుదల కనిపించకపోవడం, కాలువల్లో మురుగుతీత లేకపోవడం,దోమల నివారణ కనిపించకపోవడం తదితర సమస్యలు మున్సిపాలిటీ వేధిస్తున్నాయన్నారు. వైసిపి, కూటమి పాలకులు ఆడుతున్న కుర్చీ ఆటలో భాగంగా ఒకరి బలహీనతలు మరొకరు బయటపెట్టి ప్రజల వద్ద చులకన అవుతున్నారన్నారు.ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన కౌన్సిలర్లు వారి వారి వార్డుల్లో పాలనపై దృష్టి సారించాలన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు విద్యార్థినిలు ఎంపిక

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండల ంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బిజెపురం నుండి ఐదుగురు విద్యార్థినిలు జాతీయ ప్రతిభా అన్వేషణ ఉపకార వేతనం (ఎన్.ఎంఎంఎస్) పరీక్షకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రఘురామ రాజు తెలిపారు. దొళ్ళు ఇంద్రాణి, గంట శ్రీవిద్య, కోట

కోమలి, చరిస్మా, దంగభద్ర కీర్తన, గంట యామినిలు ఎంపికైనట్టు తెలిపారు. కాదా పాఠశాలలో జీవశాస్త్ర ఉపా ధ్యాయులు గుంట్రెడ్డి వెంకటనాయుడు ఇచ్చిన తర్ఫీదు మేరకు మీరు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. కేవలం ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అందిస్తున్న ఈ ఉపకార వేతనం ఒక సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్స రాలు పాటు ప్రభుత్వం వీరికి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌కు పాఠశాల నుండి ఐదుగురు ఎంపికైనందుకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులకు అభినందనలు తెలియజేశారు.

152 మందికి కంటి పరీక్షలు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండల కేంద్రమైన జియ్యమ్మవలసలో నవజీవన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ తిరుపతి, శ్రీధర్ జిల్లా అంధత్వ నివారణ సంస్థ పార్వతీపురం వారి సౌజన్యంతో సత్య సాయి 100వ జన్మదిన వేడుకలో భాగంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ జాక్సన్ 152 మందికి కంటి తనిఖీలు నిర్వహించగా వీరిలో 71 మంది ఐఓఎల్ కేటరెక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ సేవా సంస్థ సభ్యులు కె.ప్రభుదాస్, అచ్యుతరావు, గవర్నమెంట్ కంటి డాక్టర్ జి. వేణుగోపాల్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం చాలా మంచిది

అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు

విశాలాంధ్ర - పాలకొండ: ప్రకృతి సేద్యం రైతులకు ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి సేద్యం పట్ల రైతులు మక్కువ చూపాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు అన్నారు. రసాయనిక ఎరువుల వాడకంలో 2023-24లో రసాయనిక ఎరువుల వినియోగం 82 శాతం అధికంగా నమోదవ్వడం విచారకరమని, దేశంలో సగటున ఎకరాకు 56 కిలోలు వాడుతుండగా ఎ.పిలో మాత్రం 102 కిలోలు వినియోగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 10 లక్షల మంది రైతులు 12.15 లక్షల ఎకరాల్లో సహజ వ్యవసాయం చేస్తున్నారని రైతు సాధికార సంస్థ చెబుతుందని, అయినా ఎరువుల వాడకం ఎంత మాత్రం తగ్గకపోవడం గమనార్హమన్నారు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి కోటి మంది రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ ఇస్తామంటున్నారని, కోటి ఎకరాల్లో రసాయనిక రహిత వ్యవసాయం చేయడానికి కృషి చేస్తామని చెబుతున్నారని, దీన్నిబట్టి గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు వైఫల్యమా..? దీనికి రైతులందు అవగాహన లోపమా దీనిపై పరిశోధించవలసి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని 5 జిల్లాల్లో అత్యధికంగా గుంటూరు, తిరుపతి,బాపట్ల,చిత్తూరు. శ్రీకాకుళం జిల్లాలో కాంప్లెక్స్ వాడే జిల్లాలుగా గుర్తించారని, రైతులు ఏ ఎరువు బస్తా కొన్నా దానితో పాటే యూరియా కొని పొలంలో జల్లుతున్నారని, ఇందుకు కారణం ధర తక్కువగా ఉండటం అన్నారు.

పోషణ పక్వాడ గర్భిణీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు వరం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా పథక సంచాలకురాలు సూర్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: ఈనెల 8 నుంచి ప్రారంభమైన పోషణ పక్షోత్సవాలు గర్భిణీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు వరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకురాలు ఎన్ సూర్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏడవ పోషణ పక్షోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక సిడిపిఓ జీ వి రమణ (రమణి) ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె స్థానిక వైద్యాధికారిని జి భవాని, ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ రామలక్ష్మి, ఎం పి హెచ్ ఈ ఓ స్వామి లతో కలిసి పోషణ పక్వాడ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పోషణ పక్షోత్సవం ప్రతీ ఏటా ఏప్రిల్ 8 నుండి 22 వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏడవ పోషణ పక్షోత్సవంలో భాగంగా గర్భస్థ దశ నుండి శిశువుకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు వెయ్యి రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించాలని అంగన్వాడీలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గర్భవతులందరికీ ప్రసవ సంసిద్ధత మరియు నవజాత శిశు సంరక్షణ, ముర్రుపాల ఆవశ్యకతపై అవగాహన కలిగించడం జరిగిందన్నారు. అదే క్రమంలో లబ్ధిదారులు తమంతట తామే పోషణ ట్రాకర్లు నమోదు చేసుకునే విధానంపై ప్రసారం, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం (%జపీఎంవీ%) అమలు చేయడం ద్వారా పిల్లలలో పోషకాహార లోపం నివారించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేయటం వంటి కార్యక్రమాలు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో విజయవంతంగా నిర్వహించాలని అంగన్వాడీలకు సూచించడం జరిగిందన్నారు. అనంతరం 20 మంది గర్భిణీలకు ప్రాజెక్టు డైరెక్టర్ సూర్య లక్ష్మి చేతుల మీదుగా సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు బాల సంజీవని కిట్లు, సంపూర్ణ పోషణ కిట్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజంగి మాజీ సర్పంచులు డి రామస్వామి, పెనుమాల కాంతమ్మ, మహిళా సంరక్షణ అధికారిని హిమబిందు, సూపర్వైజర్లు గౌహరున్నీషా, కే విజయ్ కుమారి, ఎస్ గౌరీ, పి అప్పలనరస, సెక్టార్ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా నియోజకవర్గాల విజన్ ప్లాన్: కలెక్టర్

విశాలాంధ్ర - బెలగాం : జిల్లాలోని భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా శాసనసభ నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్ ను రూపొందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ కోరారు. విజన్ ప్లాన్ రూపకల్పనలో వృద్ధి వాస్తవానికి దగ్గరగా ఉండాలని, పక్కా ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వర్ణాంధ్ర -2047 కెపాసిటీ బిల్డింగులపై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు రెండు రోజుల వర్క్‌షాప్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాకు సంబంధించి డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించడం జరిగిందన్నారు. అలాగే శాసనసభ నియోజకవర్గాల వారీ ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు.

ప్రణాళికల రూపకల్పనలో అన్ని నియోజకవర్గాలకు ఒకే ప్రణాళిక ఉండరాదని హితవు పలికారు. నియోజకవర్గాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొనే సమయంలో నియోజకవర్గ శాసనసభ్యుల సలహాలు, సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాల భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నియోజక వర్గాల ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ ఉద్ఘో దించారు. ఈ ఏడాది 16.12 శాతం వృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని, తద్వారా తలసరి ఆదాయం రూ.1,94,048/-లగా అంచనా వేస్తూ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ముఖ్యంగా జిల్లాలో 49.27 శాతం మేర ప్రాథమిక రంగం (వ్యవసాయ, అనుబంధ రంగాలు) నుంచే వృద్ధి ఉండబోతున్నట్లు పేర్కొన్నారు. 41.64 శాతం సేవా రంగాల నుంచి, 9.09 శాతం పారిశ్రామిక రంగం నుంచి వృద్ధి ఉండనున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రాథమిక రంగంలో ఉద్యాన పంటల సాగును విస్తరించడం, పశు సంపదను వృద్ధి చేయడం తదితర చర్యల ద్వారా ఘననీయంగా వృద్ధి ఉంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే పండ్లు, కూరగాయల సాగుకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రణాళిక శాఖ విశ్రాంత డైరక్టర్, సలహాదారు సీతాపతిరావు, మూడు జిల్లాల ముఖ్య ప్రణాళిక అధికారులు పి. బాలాజీ, పి. వీర్రాజు, వివిఎస్ లక్ష్మిప్రసన్న, నియోజక వర్గాల ప్రత్యేకాధికారులు, పర్యవేక్షణ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.